# లక్ష్యానికి చేరువగా..

## బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యం 463.17 కోట్లు

- ఇచ్చిన రుణాలు రూ.386.88 కోట్లు
- ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యంలో 83.53 శాతం పూర్తి
- రాష్ట్రంలో పదో స్థానంలో వికారాబాద్ జిల్లా
- ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న గ్రామీణ మహిళలు




పరిగి, జనవరి 3 : స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం వారికి బ్యాంకు లింకేజీ కింద రుణ సదుపాయం కల్పిస్తున్నది. ప్రతి సంవత్సరం నిర్దేశించిన లక్ష్యం మేరకు రుణాలు ఇప్పించడంతోపాటు వాటి రికవరీని సైతం ప్రత్యేకంగా తీసుకోవడంతో వికారాబాద్ జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ముందడుగు వేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 2023-24లో వికారాబాద్ జిల్లా పరిధిలోని 19 మండలాల్లో 10375 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.463.17 కోట్లు రుణాలుగా ఇప్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జనవరి 2వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 5336 స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ కింద రూ.386.88 కోట్లు రుణాలుగా ఇచ్చారు. తద్వారా రాష్ట్రంలోనే వికారాబాద్ జిల్లా బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించడంలో పదో స్థానంలో కొనసాగుతున్నది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పూర్తి స్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రుణాలు సక్రమంగా చెల్లిస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ కింద రుణ సదుపాయాలతో గ్రామీణ మహిళలు మరింత ఆర్థిక వృద్ధి సాధిస్తున్నారు.

### వ్యాపారాభివృద్ధికి రుణాలు దోహదం

మహిళలు బ్యాంకు లింకేజీ రుణాలు పొంది కిరాణ దుకాణాలు, ఆవులు, గేదెలు, టైలరింగ్ యూనిట్లు, వ్యవసాయ పరికరాలు, ఇతర వాటి ఏర్పాటుకు వినియోగించుకుంటున్నారు. ఇచ్చిన లక్ష్యం మేరకు స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇప్పించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు లోపే లక్ష్యం కంటే అధికంగా రుణాలు ఇప్పించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారు. ఇదిలావుండగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇచ్చిన రుణాలను తిరిగి చెల్లించడంలోనూ జిల్లా మంచి స్థానంలోనే ఉంది. రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించడంతోపాటు 97 శాతం రికవరీతో ముందున్నది.

### మూడు మండలాల్లో లక్ష్యం కంటే అధికంగా రుణాలు

వికారాబాద్ జిల్లా పరిధిలో 19 మండలాలుండగా వాటిలో మూడు మండలాల పరిధిలో బ్యాంకు లింకేజీ కింద అధికారులు లక్ష్యం కంటే అధికంగా రుణాలు ఇప్పించారు.

| మండలం | సంఘాలు | నిర్దేశిత రుణం (రూ.కోట్లలో) | ఇచ్చిన రుణం(రూ.కోట్లలో) శాతం |
|---|---|---|---|
| కోట్‌పల్లి | 246 | 15.46 | 16.14 (104.42) |
| మోమిన్‌పేట్ | 301 | 31.47 | 32.76 (104.10) |
| బంట్వారం | 151 | 11.89 | 12.26 (103.08) |
| దౌల్తాబాద్ | 275 | 31.45 | 18.70 (59.48) |
| పూడూరు | 310 | 27.84 | 19.34 (69.49) |
| బొంరాస్‌పేట్ | 266 | 25.94 | 19.02 (73.32) |
| కొడంగల్ | 238 | 19.2 | 15.36 (79.74) |
| పరిగి | 319 | 24.93 | 19.81 (79.46) |
| పెద్దేముల్ | 327 | 31.60 | 25.37 (80.28) |
| ధారూరు | 188 | 19.42 | 15.69 (80.78) |
| వికారాబాద్ | 208 | 24.72 | 20.34 (82.26) |
| చౌడాపూర్ | 195 | 14.78 | 12.22 (82.67) |
| కులకచర్ల | 357 | 26.70 | 22 (82.38) |
| దోమ | 384 | 28.1 | 23.38 (82.91) |
| మర్పల్లి | 264 | 25.11 | 20.93 (83.34) |
| బషీరాబాద్ | 462 | 29.09 | 24.35 (83.73) |
| నవాబుపేట్ | 244 | 24.80 | 21.73 (87.62) |
| తాండూరు | 324 | 26.33 | 23.82 (90.46) |
| యాలాల | 277 | 24.10 | 23.60 (97.90) |

### లక్ష్యంలో 83.53 శాతం రుణాలు



వికారాబాద్ జిల్లా పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ కింద రూ.463.17 కోట్లు రుణాలుగా ఇప్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. జనవరి 2 వరకు జిల్లాలోని 5336 స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ కింద రూ.386.88 కోట్లు రుణాలు ఇప్పించాం. రుణాలు తీసుకున్నవారు సైతం సక్రమంగా చెల్లిస్తున్నారు. రుణాలు పొందినవారు సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలి.

**- కృష్ణన్, డీఆర్‌డీవో**

తద్వారా బ్యాంకర్లు సైతం స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేస్తే రికవరీ రేటు సైతం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

# పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

- వికారాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందాం
- రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

వికారాబాద్, జనవరి 3 : పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం బంట్వారంలో నిర్వహించిన ప్రజా పాలన, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సభాపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందన్నారు. వికారాబాద్ నియోజకవర్గాన్ని మూడు వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో సాధ్యమైనంత వరకు అర్హులైన ప్రతిఒక్కరూ ఆరో తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో లేనివారికి తిరిగి నాలుగు నెలల తర్వాత దరఖాస్తు చేసుకునే అవకాశముంటుందని పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీలను అర్హులందరూ వినియోగించుకోవాలన్నారు. లబ్ధిదారులకు నష్టం వాటిల్లకుండా గత ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను యథావిధిగా అందజేస్తున్నామని, భవిష్యత్తులో లక్షా116 రూపాయలతోపాటు తులం బంగారం లేదా లక్షా అరవై వేల రూపాయల చెక్కులను అందజేయనున్నట్లు స్పీకర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో విజయ కుమారి, సర్పంచ్ లావణ్య, కోట్‌పల్లి జడ్పీటీసీ సంతోష, ఎంపీపీలు ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ పద్మ, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి, జనవరి 3 : సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 110 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారవేత్తలు అనంతరెడ్డి, కిషన్ రూ.20 లక్షల విరాళం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రష్మీ సాధన పెరుమాళ్, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐలు వినాయక రెడ్డి, మోకిల ఇన్‌చార్జి సీఐ నాగరాజు, ఎస్ఐ సంతోష్‌రెడ్డి, డీఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

# తప్పులు లేకుండా చూడాలి

- వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
- బుద్దారంలో ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ పరిశీలన
- ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా రసీదును అందించాలి
- ఆరు గ్యారెంటీలపై అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి


బుద్దారంలో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పెద్దేముల్, జనవరి 3 : గ్రామాల్లో ఆరు గ్యారెంటీల పథకాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న దరఖాస్తుదారుల వివరాలు, వారు టిక్ చేసిన పథకాలు, అంశాలను అన్ని సరిగ్గా చూసుకొని దరఖాస్తులను స్వీకరించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని బుద్దారం గ్రామంలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తుదారులు అందిస్తున్న ప్రతి దరఖాస్తును సిబ్బంది సరిచూడాలని, పథకాలు కరెక్ట్‌గా టిక్ చేస్తున్నారా లేదా? ఏమైనా తప్పులున్నాయా? దరఖాస్తును సరైన పద్ధతిలో అన్ని వివరాలతో పూర్తి చేశారా లేదా? అనే అంశాలను సిబ్బంది పరిశీలించి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. ఒకవేళ దరఖాస్తుల్లో తప్పులుండి అలాగే స్వీకరిస్తే.. డేటా ఎంట్రీ సమయంలో చాలా ఇబ్బందులు ఎదురై.. విచారణ సమయంలో సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రజలకు ఆరు గ్యారెంటీల గురించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, మహాలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేవారు 18 నుంచి 57 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నవారు అర్హులని.. ఆధార్ కార్డు, రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకొని దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి తప్పనిసరిగా రేషన్ కార్డు ఉండాల్సిన అవసరం లేదని, రేషన్ కార్డు అవసరమున్నవారు తెల్లకాగితంపై దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందని సూచించారు. అంతకుముందు ప్రజలతో మాట్లాడుతూ.. దరఖాస్తులు పరిశీలిస్తూ దరఖాస్తులను ఎవరు నింపారు? మీకు దరఖాస్తులను ఎవరిచ్చారు? డబ్బులు ఏమైనా తీసుకున్నారా? వివరాలు సరిగ్గా నింపుతున్నారా? అని అడిగి రసీదును పొందాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లలితాకుమారి, సర్పంచ్ లక్ష్మి, ఎంపీడీవో లక్ష్మప్ప, ఎంపీవో రమేశ్‌కుమార్, ఆర్ఐ రాజురెడ్డి, సూపర్‌వైజర్ రాణి, ఏపీవో నర్సింహులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఎంపీడీవో లక్ష్మప్పపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాపాలనలో భాగంగా బుద్దారంలో దరఖాస్తుల ప్రక్రియను కౌంటర్ల వారీగా పరిశీలించిన కలెక్టర్ ప్రత్యేక దరఖాస్తుల కౌంటర్‌ను కూడా పరిశీలించారు. అందులో ఏమేమి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు? ఎన్ని స్వీకరించారు ఇప్పటివరకు? ప్రజలకు వారిచ్చిన ఇతర దరఖాస్తులకు సంబంధించి ప్రింటెడ్ రసీదును ఇస్తున్నారా? లేదా? అని కలెక్టర్ సిబ్బందిని, ఎంపీడీవోను ప్రశ్నించారు. ఆ సమయంలో కౌంటర్లో రసీదు పుస్తకం లేకపోవడంతో కలెక్టర్ టీం లీడర్ ఎంపీడీవో లక్ష్మప్పపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రసీదు బుక్కు మీకు ఇవ్వలేదా? ప్రింట్ చేసి రసీదు బుక్కు మేము మీకు ఎందుకు ఇచ్చాం? చూసుకోరా మీరు? మీరు ప్రజలకు రసీదులు ఎందుకు ఇస్తలేరు? ఈ విషయంలో మీరు ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించారు. అనంతరం ఇప్పటివరకు స్వీకరించిన దరఖాస్తుదారులను పిలిపించి రసీదులను అందరికీ అందించాలని కలెక్టర్ సూచించారు.